క్లుప్తంగా

కృత్రిమ ఇసుక ఫిల్టర్లను తొలగించాలి

రెవెన్యూ, పోలీస్‌లకు గ్రామస్తుల ఫిర్యాదు

కేశంపేట: గ్రామంలో అక్రమంగా వెలసిన కృత్రిమ ఇసుక ఫిల్టర్లను తొలగించాలని గ్రామస్తులు, యువజన నాయకులు శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు గ్రామ శివారులోని వాగు నుంచి మట్టితీసి అక్రమంగా ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నట్లు వారు తెలిపారు. అధికారులు స్పందించి ఇసుక తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తీగల వాగు సర్వే

హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు



తీగల వాగును సర్వే చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పత్తేపురం శివారుల్లోని తీగల వాగును శనివారం ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారు. తీగల వాగును సర్వే చేసి హద్దులు గుర్తించి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగును కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. అనంతరం ఈ సర్వే నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ఇన్‌స్పెక్టర్ లింగం, సర్వేయర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



ఫ్రెషర్స్ డే ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు, డ్యాన్సులు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేశ్, కనకారావు, శ్వేత, దీప్తి, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, జ్యోతిక, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షల వెల్లువ



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో సర్పంచ్ శైలజ, కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర మూడో స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన నివాసంలో స్పీకర్‌గా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగి యాదయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, బి ఆగిరెడ్డి, జంగారెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు సూర్యాపేట శ్రీనివాస్‌గౌడ్, కావలి వెంకటేశ్‌బాబు, పాష, కె దుర్గాప్రసాద్, రవీందర్‌రెడ్డి, ఎర్ర గోపాల్, ఎ వెంకట్‌రెడ్డి, తరుణ్, బాలక్రిష్ణ, పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రారంభం

పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో

చేవెళ్ల: మండలకేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, జనరల్ ఆసుపత్రిలో ఇక నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. చేవెళ్ల మండలంతోపాటు పరిసర ప్రాంత ప్రజల కోరిక మేరకు ఈ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నుంచి శనివారం వరకు న్యూరాలజీకి సంబంధించిన సేవలు అందించబడుతాయని, సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్లాస్టిక్ సర్జరీలు చేయబడుతాయని, మంగళవారం డయాబెటిక్, థైరాయిడ్, ఒబెసిటీకి సంబంధించి, బుధవారం గుండె జబ్బులు, యూరాలజీ, గ్యాస్ట్రాలజీ, గురువారం నెఫ్రాలజీకి సంబంధించిన వైద్యసేవలు ప్రత్యేకంగా చూడబడుతాయని తెలిపారు. ప్రజలు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండె పదిలం

- చిన్నా, పెద్దా తేడా లేదు
- ఒత్తిడి, ఆందోళనతో సమస్య అధికం
- మారుతున్న ప్రజల జీవనశైలి
- ఆహార నియమాలు, వ్యాయామంపై నిర్లక్ష్యం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



షాబాద్: మన శరీరంలో గుండె అత్యంత ముఖ్యమైన అవయవం. ఇది శరీరంలో ఛాతి, ఊపిరితిత్తుల మధ్య ఉంటుంది. గుండె ఆక్సిజన్, పోషకాలని రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. ఇటీవలి కాలంలో మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్లే ప్రస్తుతం వయస్సు, లింగ బేధంతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారు. రోజురోజుకు గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఆరోగ్యంగా ఉన్న యువతలో కూడా అకస్మాత్తుగా గుండెపోటు రావడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఇప్పుడున్న పరిస్థితుల్లో గుండెపోటు ధరి చేరకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో గుండెపోటు కేసులు కలవర పరుస్తున్నాయి. 50 ఏళ్లలోపు గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్న తీరు విస్మయపరుస్తోంది. ఒకప్పుడు 60 పైబడిన వారిలో మాత్రమే ఈ సమస్య కనిపించేది. నేడు 40 ఏళ్లలోపు వారినీ కూడా ఇది మింగేస్తోంది.

ఆహారపు అలవాట్లు..

రోజూ తినే ఆహారపు అలవాటు భయాందోళనకు గురిచేస్తోంది. కొవ్వు సంబంధిత ఆహారం, నూనె, నెయ్యి ఎక్కువగా తీసుకోవడం, మద్యం, సిగరేట్లు ఎక్కువగా తీసుకోవడం వంటివి ప్రధాన కారణాలు. ఏటా ఐదు వేల నుంచి ఆరు వేల వరకు గుండెపోటుకు గురవుతున్నారని ఆయా నివేదికలే చెబుతున్నాయి.

వ్యాయామం చేయకపోవడం..

యువకుల్లో మారుతున్న ఆహారపు అలవాటు ఇబ్బందులకు గురి చేస్తుంది. కిలోమీటర్ వెళ్లాలన్నా బైక్‌లపై వెళ్తున్నారు. ఇష్టారాజ్యంగా కొవ్వుతో కూడిన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, వంటి లక్షణాలతో గుండెపోటుకు గురవుతున్నారు. శరీరానికి వ్యాయామం ఉత్తమ రక్షణగా పలువురు నిపుణులు చెబుతున్నారు. కానీ నేటి యువత ఆచరించకపోవడం బాధాకరం. ఆల్కహాల్, సిగరేట్లు వంటివి అలవాటుగా మారడంతోనే గుండెపోటుకు కారణాలుగా నిలుస్తున్నాయి.

ఒత్తిడే కారణం..



రోజువారి జీవనశైలిలో భాగంగా కొందరు ఉద్యోగ పరంగా లేదా వైవాహిక పరంగా ఒత్తిడికి లోనవుతున్నారు. కొవ్వు సాధారణ స్థాయిలో ఉన్నవారికి కూడా గుండెపోటు వస్తోంది. పరస్పరం సామరస్యంతో కుటుంబాల్లో సమస్యలు పరిష్కరించుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఎక్కువగా బయట ఆహారాన్ని తీసుకోవడం మంచిది కాదు. ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడానికి ప్రయత్నం చేయాలి.

– జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్

గుండెపోటుకు ప్రధాన కారణాలు..

- రక్తపోటు నియంత్రణలో లేకపోవడం, రక్తపోటు ఉందని తెలుసుకోలేకపోవడం.
- కొవ్వు పేరుకుపోయి గుండెకు వెళ్లే రక్తనాళాలు సక్రమంగా పనిచేయకపోవడం.
- వయస్సుకు సంబంధం లేకుండా ఎత్తుకు తగిన దానికంటే బరువు ఎక్కువగా ఉండడం.
- ఎక్కువ నూనెలు, కొవ్వుతో కూడిన ఆహారపదార్థాలు తీసుకోవడం.
- తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురికావడం
- ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించకపోవడం, నిత్యం వ్యాయామం చేయకపోవడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రోజూ క్రమం తప్పకుండా కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- 35 ఏళ్లు వచ్చాక మధుమేహం, బీపీ పరీక్షలు తరచూ చేయించుకోవడం మంచిది.
- ఆరు మాసాలకు ఒకసారి విధిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలి.
- ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- షుగర్, బీపీ ఉన్న వాళ్లు మందులతో వాటిని అదుపులో ఉంచుకోవాలి.
- శరీరంలో కొవ్వు, నూనె మోతాదుకు మించి ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి గరుడ వాహన సేవలో భక్తులు

చేవెళ్ల: శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శనివారం చేవెళ్ల మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన పెంజర్ల వెంకట్‌రెడ్డి దంపతులు స్వామి వారి కల్యాణం నిర్వహించి గరుడవాహన సేవలో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ గరుడవాహన సేవను ఊరేగించారు. గోవిందా..గోవిందా..అంటూ నామస్మరణం మారుమ్రోగింది.

మాలధారుల పూజలు..

మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది మాలధరించిన స్వాములు భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో స్వామి వారి పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు, స్వాములకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారి శైలజ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

హామీ అమలులో కేంద్రం విఫలం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగపాగ జంగయ్య

షాద్‌నగర్: ఇచ్చిన హామీ అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగపాగ జంగయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నా ఏ ప్రభుత్వాలు, పార్టీలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు మాదిగలు అభివృద్ధికి నోచుకోలేదని ఆయన చెప్పారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మాదిగలు, మాదిగ ఉపకులాల పురోభివృద్ధి సాధించాల్సి అవశ్యకత ఉందన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని సింగపాగ జంగయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం బిల్లు ప్రవేశపెట్టకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ నెల 20న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, కృష్ణ, శ్యాం, భీంరాజ్, రాజు, పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని గోపులారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నగరంలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన గ్రామానికి చెందిన బి ప్రవీణ్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి నడవడికతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ఫుడ్‌కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్‌కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమితో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కుంగిపోవద్దని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, చంద్రశేఖర్‌రెడ్డి, సతీశ్, గుత్తి బాలస్వామి, సైదులు, ప్రసాద్, కిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహాపడి పూజకు హాజరు

మాడ్గుల: మాడ్గుల మండలం కొలుకులపల్లి గ్రామంలో వెంకటేశ్‌స్వామి నివాసంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనతో గ్రామం మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిని వెంకటేశ్ స్వామిని ఘనంగా సత్కరించారు. పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులు బట్టు ధర్మారెడ్డి, భూపతి రెడ్డి, శివ, జంగయ్య, పాండు, పెద్దిరాజు, చంద్రమౌళి, చంద్రశేఖర్ రెడ్డి, గురువయ్య, రాజశేఖర్, సతీశ్, యాదయ్య, పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యురాలిగా శిరీష



ఎంపికైన శిరీష

చేవెళ్ల: ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యురాలిగా చేవెళ్ల మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన శిరీష ఎన్నికైంది. శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో జరుగుతున్న ఏబీవీపీ జాతీయ మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర కార్యవర్గంలో సభ్యురాలిగా చోటు కల్పించడం సంతోషకరమన్నారు. ఏబీవీపీ అంటేనే విద్యారంగ సమస్యలపై పోరాటం చేసే అతి పెద్ద సంస్థ అని చెప్పారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు శిరీష కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులతో కలిసి పోరాడుతానని ఆమె పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల



సమావేశంలో మాట్లాడుతున్న విశాల

కేశంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ సమావేశం విశాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న సేవలు అమోఘమని అన్నారు. అనంతరం దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్, డిడబ్ల్యూఓ పద్మజ, మంచాల, కందుకూర్ జెడ్పీటీసీలు నిత్య నిరంజన్‌రెడ్డి, జంగారెడ్డి, సీడీపీఓలు, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రకటన హర్షణీయం

మంచాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం హర్షనీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. శనివారం మంచాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని త్వరలో అమలు చేసి ఉద్యోగులకు అండగా నిలువాలని కోరారు.

20న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ఈ నెల 20న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శనివారం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ధనుర్మాసం శుభప్రదం

- నేటి నుంచి ప్రారంభం
- 23న ముక్కోటి ఏకాదశి
- జనవరి 14న శ్రీగోదారంగనాదుల కల్యాణం



రంగదాముల గ్రామంలో కొలువైన రంగనాథస్వామి

షాద్‌నగర్: శ్రీ మహావిష్ణువుకి ప్రీతికరమైన పవిత్ర మార్గశిర మాసంలో సూర్య భగవానుడు ధనూరాశిలో ప్రవేశించిన నాటి నుంచి ధనుర్మాసం ప్రారంభం అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. శనివారం నుంచి ఈ మాసం ప్రారంభమై సూర్యుడు మకర రాశిలోకి వెళ్లిన తరువాత మకర సంక్రాంతి జనవరి 15న పూర్తవుతుంది. జనవరి 14న భోగి రోజు గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ధనుర్మాస ఉత్సవాలకు దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల రోజులు సుప్రభాతం బదులు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. తొలి పదిహేను రోజులు స్వామి వారికి చక్కెర పొంగలి, తర్వాతి 15 రోజులు దద్దోజనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

23న ముక్కోటి ఏకాదశి..

ధనుర్మాసం నెల రోజుల పాటు శ్రీవైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం గోదాదేవి పల్లకీ సేవ, తిరుప్పావై పాశుర విన్నపం, ప్రతి శుక్రవారం కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ధనుర్మాస ప్రధానమైన వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఈ నెల 23 వైభవంగా జరగనుంది. ఆలయాల్లో స్వామి వారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 2గంటల నుంచే స్వామి వారికి అభిషేకాలు, 5గంటలకు ఉత్తరద్వార దర్శనం ఉంటుంది. షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, మొగిలిగిద్ద పరిధిలోని రంగదాముల గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు నిర్వహించనున్నారు. జనవరి 14న భోగి సందర్భంగా దేవాలయాల్లో శ్రీ గోదా శ్రీ రంగనాథుల కళ్యాణం చేయనున్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్



మట్టి రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

షాబాద్: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తామని పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకొని సొంత ఖర్చులతో మట్టి రోడ్డు వేయించారు. శనివారం పెద్దవేడు గ్రామంలో వేసిన రోడ్డును గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు పరుస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ కాలని నుంచి రైతుల తమతమ పొలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుమార్గంగుండా వెళ్లొచన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రామకృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్, కృష్ణ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రంగంపల్లి, మొగిలిగిద్ద, దేవునిపల్లి, చించోడ్, అయ్యవారిపల్లి, రామేశ్వరం, రాయికల్, అన్నారం, గ్రామాల్లో ట్రస్టు చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తాను ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేశానని, ప్రచారంలో భాగంగా గ్రామాలకు వచ్చిన సందర్భంగా తనను ప్రజలు ఎంతో ఆదరించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అభిమానులు, కార్యకర్తలు ఎవరు అధైర్యపడొద్దన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చాటుదామని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ఎల్లప్పుడు ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్నాతి శ్రీనివాస్, నర్సింహా యాదవ్, సుధాకర్, అనిల్, భీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజు, నర్సింలు, గణేశ్, వెంకటేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంసుందర్‌రెడ్డికి ఘన సన్మానం



శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిని శనివారం షాద్‌నగర్‌కు చెందిన పలువురు తెలంగాణ ఉద్యమ కారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ షాద్‌నగర్‌లో కాంగ్రెస్ గెలుపునకు శ్యాంసుందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేకగూడ సర్పంచ్ పాండురంగారెడ్డి, దిలీప్‌కుమార్, బీరప్ప, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిని సన్మానిస్తున్న తుమ్మల నర్సింహ యాదవ్

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

నందిగామ: ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకుంటే మానసింగా ప్రశాంతంగా ఉండగలరని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల నర్సింహా యాదవ్ నివాసంలో శనివారం అయ్యప్ప స్వామి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాల వేసుకున్న మాలధారులు కఠిన నియమ నిబంధనలు పాటిస్తూ 41 రోజుల పాటు దీక్షలో ఉంటారని వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరిజీవన్, బంటారం సుదర్శన్ గౌడ్, లక్ష్మయ్య యాదవ్, తుమ్మల నర్సింహా, మెక్కొండ కుమార్ గౌడ్, తమ్మల జగన్, తుమ్మల నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఇబ్రహీంపట్నం: ఆటో డ్రైవర్లు, ఓనర్లను ఆదుకోవాలని ఆటో జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో జేఏసీ ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించి.. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య ంతో ఆటోడ్రైవర్లు, ఓనర్లు ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమ బో ర్డును ఏర్పాటు చేయాలని కోరారు. 25 పైసల వడ్డీకి రుణాలివ్వాలని, నెలకు రూ.12 వేలు ఆర్థిక సా యంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డి మాండ్ చేశారు. యూనియన్ నాయకులు జంగ య్య, రామచంద్ర, అశోక్, రాములు, భాస్కర్, కిషన్ పాల్గొన్నారు.